# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 21.04.2025 | 24 క్యారెట్లు 80,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:170

www.vishalabharati.com




# రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు

- జపాన్ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు
- ఆరోగ్యం, ఇంజినీరింగ్ టూరిజంలో అవకశాలు
- కితాక్యూషూ నగరాన్ని సందర్శించిన తెలంగాణ రైజింగ్ బృందం
- టోక్యో తరహాలో హైదరాబాద్ అభివృద్ధి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణకు పెట్టుబడుల వరద పారించాలనే లక్ష్యంతో జపాన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండ్ టీమ్ బిజీ బిజీగా పర్యటిస్తోంది. నాలుగు రోజులుగా జపాన్‌లోనే తెలంగాణ రైజింగ్ బృందం ఉంది. జపాన్‌లో పర్యటిస్తున్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం.. ఆదివారం కితాక్యూషూ నగరాన్ని సందర్శించింది. నగర మేయర్ కజుహిసా టకేచీని తెలంగాణ బృందం

..మిగతా 2 లో

# త్వరలో ఉప ఎన్నికలు






- ఈ ఏడాదిలోనే వచ్చే అవకాశం
- రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ రెండు శత్రువులే
- రేవంత్, మోదీ నాయకత్వంలో రాష్ట్రం, దేశం వెనక్కి పోయింది
- మళ్లీ కేసీఆర్ సీఎం అవ్వడం చారిత్రక అవసరం
- బీఆర్ఎస్ఓటమితో తెలంగాణకే ఎక్కువ నష్టం
- రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలి
- పదేండ్ల పాటు సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెద్దుల్లాగా నడిపించారు
- బీజేపీ దేశంలో మత పిచ్చి లేపడం తప్ప చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రాష్ట్రంలో త్వరలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాదిలోనే వచ్చే అవకాశం ఉందని.. అందరూ సిద్ధంగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు. తెలంగాణ భవన్‌లో రాజేంద్ర నగర్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి అధ్యక్షతన అత్తాపూర్ డివిజన్ నుండి శ్రీరామ్ రెడ్డి, పలు పార్టీల నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ కేటీఆర్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాబోయే ఎన్నికల్లో మనం గెలవడం మన కోసం కాదు.. తెలంగాణ సమాజానికి మళ్లీ తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసుకోవడం చారిత్రక అవసరమని పేర్కొన్నారు.

విశాల భారతి,స్టేట్ బ్యూరో:

రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందన్నారు. కచ్చితంగా ఏప్రిల్ 27వ తేదీ నాడు.. వరంగల్‌కు తరలిరావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. పదేండ్ల పాటు సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెద్దుల్లాగా కేసీఆర్ పరుగులు పెట్టించారని.. మొన్నటి ఎన్నికల్లో మనం ఓడిపోవడంతో మనకు జరిగిన నష్టం తక్కువ.. కానీ మన ఓటమితో తెలంగాణ సమాజానికి ఎక్కువ నష్టం జరిగింది. ఇది అక్షర సత్యం, వాస్తవమని కేటీఆర్ స్పష్టం చేశారు.

**రేవంత్‌పై నోరు పారేసుకోవడం వేస్ట్..**

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆకాశ స్థాయికి తీసుకుపోయి స్వరాష్ట్రాన్ని సాధించిన గులాబీ జెండా.. మన నాయకుడు కేసీఆర్. ఈ రికార్డును ఎవరూ చెరపలేరు. కేసీఆర్ ఆనవాళ్లను

..మిగతా 2 లో

# రేషన్ కార్డుల్లో పేర్ల మార్పులో గందరగోళం

- కొత్త పేర్లు చేర్పించడంలో ఇబ్బందులు
- సర్వేలో వెలుగులోకి సాంకేతిక సమస్యలు
- పిల్లల వివరాలు తీసుకోని యాప్
- పాత కార్డుల్లో ఉన్న పేర్లు తొలగిస్తే రేషన్ కట్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కొత్త రేషన్ కార్డుల కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు. కొత్త రేషన్ కార్డులతో పాటు పాత కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను చేర్చే ప్రక్రియ కోసం సర్వే చేస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు, మీసేవ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ సర్వేలో యాప్ అనేక రకాలుగా ఇబ్బంది పెడుతోంది. దీంతో అధికారులు సమస్యను ఫొటో తీసి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులకు పంపిస్తున్నారు. అనంతరం సమస్యలను కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు.

**పిల్లల వివరాలు తీసుకోని యాప్..**

కొత్తగా రేషన్ కార్డు నమోదు కోసం వచ్చిన దరఖాస్తుల్లో భార్యభర్తల పేర్లు వారి తల్లిదండ్రులకు చెందిన పాత కార్డుల్లో ఉంటున్నాయి. వాటిని తొలగించుకుంటేనే కొత్త రేషన్ కార్డుల్లో పేర్ల నమోదుకు వీలు అవుతుంది. కానీ చాలా మంది పాత రేషన్ కార్డుల్లో ముందే పేర్లు తొలగిస్తే రేషన్ బియ్యం బంద్ అవుతాయని

..మిగతా 2 లో

# దంచి కొట్టిన సూర్య, రోహిత్..

- చెన్నైను చిత్తుగా ఓడించిన ముంబై
- 9 వికెట్ల తేడాతో ఘన విజయం
- వరుస ఓటముల నుంచి విజయాల బాట



విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:

ఐపీఎల్ 2025 లో వరుస విజయాలతో ఢీలా పడిన ముంబై ఇండియన్స్ విజయాల బాట పట్టింది. మొదట ఆడిన 5 మ్యాచ్ ల్లో ఒకటే గెలిచిన ముంబై.. ఢిల్లీ, సన్ రైజర్స్ పై వరుస విజయాలను సాధించింది. వాంఖడే వేదికగా ఆదివారం (ఏప్రిల్ 20) చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టింది. భారీ ఛేజింగ్ లో స్టార్ బ్యాటర్లు సూర్య కుమార్ యాదవ్(30 బంతుల్లో 68: 6 ఫోర్లు, 5 సిక్సర్లు), రోహిత్ శర్మ(45 బంతుల్లో 76: 6 సిక్సర్లు, 4 ఫోర్లు) చెలరేగడంతో ముంబై సునాయాస

..మిగతా 2 లో



# ప్లాస్టిక్ రహిత పల్లెలు

- గ్రామాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు
- కాంగ్రెస్ సర్కారు మరో ముందడుగు

..మిగతా 3 లో



# కాంగ్రెస్ సర్కారుకు చిరంజీవి సపోర్ట్

- డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేద్దాం
- ప్రభుత్వంతో అందరం కలిసి నడుద్దాం
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

..మిగతా 2 లో

# ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలు

- త్వరలోనే భర్తీకి నోటిఫికేషన్
- ప్రజాపాలనలో నిరుద్యోగులకు పెద్ద పీట
- ఇప్పటి వరకు ఆర్టీసీలో 165 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం
- మంత్రి పొన్నం ప్రభాకర్



విశాలభారతి,స్టేట్ బ్యూరో :

టీజీఎస్ ఆర్టీసీలో కొలువుల జాతర ప్రారంభమైంది. త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 3,038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, త్వరలోనే నోటిఫికేషన్ వేసి సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని

..మిగతా 3 లో



# కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాష్ దారుణ హత్య

..మిగతా 3 లో

# 22 ఏళ్ల తర్వాత ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక

- ఇన్నేళ్లు ఏకగ్రీవంగా గెలుస్తున్నా ఎంఐఎం
- కొత్తగా పోటీలోకి వచ్చిన బీజేపీ
- స్థానిక బలాబలాల దృష్ట పోటీ చెయ్యని కాంగ్రెస్, బిఆర్ఎస్
- ఎంఐఎం వర్సెస్ బీజేపీగా పోటీ
- ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నిక




విశాలభారతి,స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీలో 22ఏళ్లుగా మజ్లిస్ పార్టీ ఏఐఎంఐఎం పార్టీకే ఏకగ్రీవం. కానీ

..మిగతా 2 లో

# మజ్లిస్‌ను గెలిపించేందుకు కుట్ర చేస్తారా..?



- కాంగ్రెస్, బీఆర్ఎ స్ పార్టీలు నక్సలైట్ల వారసులు
- ప్రజాస్వామ్యంలో ఉంటూఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటారా?
- మీ వైఖరితో హిందూ సమాజమంతా రగలిపోతోంది
- బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావును గెలిపించాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్, బీఆర్ఎ స్ పార్టీలు నక్సలైట్ల వారసులు అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మరో అడుగు ముందుకేసి 15 నిమిషాలు టైమిస్తే హిందువులను చంపేస్తామన్న మజ్లిస్‌ను గెలిపించేందుకు కుట్ర చేస్తారా? అంటూ రెచ్చిపోయారు. ప్రజాస్వామ్యంలో ఉంటూ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటారా? అని బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ వైఖరితో హిందూ సమాజమంతా రగలిపోతోందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
21.04.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com


## క్రికెట్ ఆడుతూ గ్రౌండ్‌లో కుప్పకూలిన యువకుడు గుండెపోటుతో మృతి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:
ఇటీవల కాలంలో గుండెపోటుతో చనిపోయే యువకుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. వయసుతో సంబంధం లేకుండా యువకుల నుంచి వృద్ధుల వరకు చాలామంది అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం జరిగింది. ఆదివారం రాంపల్లి దాయరలో ప్రణీత్ (32) అనే యువకుడు క్రికెట్ ఆడుతుండగా గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. త్యాగి స్పోర్ట్స్ వెన్యూ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతుండగా అకస్మాత్తుగా అతడు కిందపడిపోయాడు. సహచర ఆటగాళ్లు ప్రణీత్‌ను ఆస్పత్రికి తరలించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ప్రణీత్‌ది పాత బోయినపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రవీణ్ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మరోవైపు వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం దుర్గాపూర్ గ్రామంలో శనివారం ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందారు.



# రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు


మొదటి పేజీ తరువాయి

కలిసింది. ఈ సందర్భంగా అక్కడి సాంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యంతో ఉన్న నగరమే ఈ కితాక్యూషూ. అక్కడి గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. కానీ ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది. ఆ నగరం అంతగా ఎలా అభివృద్ధి చెందింది. ఎలాంటి ప్రణాళికలు అమలుచేశారనే వివరాలను తెలంగాణ బృందం తెలుకుంది. మురసాకి రివర్ మ్యూజియంతోపాటు ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌నూ సందర్శించింది రేవంత్ టీమ్.తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగేసింది. జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థ లైన టెర్న్, రాజ్ గ్రూప్‌లతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాలతో హెల్త్ కేర్‌తోపాటు పలు రంగాల్లో జపాన్ సహకారం విస్తరించనుంది. ఈ ఒప్పందాలతో ఆరోగ్యరంగంలో 200, ఇంజినీరింగ్‌లో 100, టూరిజంలో 100, నిర్మాణరంగంలో 100 ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. టోక్యో చేరిన తొలి రోజే జపాన్ పారిశ్రామిక దిగ్గజం మారుబెనీ కార్పొరేషన్‌తో భారీ ఒప్పందం కుదిరింది. ఫ్యూచర్ సిటీలోని 600 ఎకరాల్లో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఈ సంస్థ అభివృద్ధి చేయనుంది. ప్రారంభ దశలోనే వెయ్యి కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ పార్క్ ద్వారా మరిన్ని జపాన్, మల్టీనేషనల్ కంపెనీలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మొత్తంగా ఈ ప్రాజెక్ట్ ద్వారా 5 వేల కోట్లకుపైగా పెట్టుబడులు.. 30 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించబడే అవకాశం ఉందని ప్రభుత్వం చెప్తోంది. టోక్యోలోని సోనీ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. అనుబంధ సంస్థ అయిన క్రంచిరోల్ టాప్ ఎగ్జిక్యూటివ్‌లతో రేవంత్ భేటీ అయ్యారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాల్లో హైదరాబాద్‌ను హబ్‌గా అభివృద్ధి చేయాలని సీఎం ప్రతిపాదించారు. అలాగే, టోక్యోలోని జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మెట్రో ఫేజ్ 2, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, రీజనల్ రింగ్ రోడ్డు లాంటి మెగా ప్రాజెక్టులకు రూ.11వేల 693 కోట్ల విదేశీ రుణం ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ నగరాన్ని టోక్యో తరహాలో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టులు మైలురాయిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# దంచి కొట్టిన సూర్య, రోహిత్..

మొదటి పేజీ తరువాయి

విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఛేజింగ్ లో ముంబై 15.4 ఓవర్లలో వికెట్ కోల్పోయి 177 పరుగులు చేసి గెలిచింది. 177 పరుగుల లక్ష్య ఛేదనలో ముంబైకి సూపర్ స్టార్ట్ లభించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, రికెల్ టన్ మెరుపులు మెరిపించడంతో పవర్ ప్లే లో వికెట్ నష్టపోకుండా 62 పరుగులు చేసింది. ఏడో ఓవర్లో 24 పరుగులు చేసిన రికెల్ టన్ ఔట్ కావడంతో ముంబై తొలి వికెట్ కోల్పోయింది. ఈ దశలో రోహిత్ కు జత కలిసిన సూర్య అదే పనిగా రెచ్చిపోయాడు. మరో ఎండ్ లో హిట్ మ్యాన్ హిట్టింగ్ చేయడంతో మ్యాచ్ పూర్తిగా ముంబై చేతుల్లోని వచ్చింది. చెన్నై బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీల వరద పారించారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ 12 ఓవర్లో 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్ లో సూర్య 26 బంతుల్లోనే ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. చివర్లో వీరు మరింతగా చెలరేగడంతో మ్యాచ్ 16 ఓవర్లు ముందుగానే ముగిసింది. పతిరానా వేసిన 16 ఓవర్ మూడు, నాలుగు బంతులకు వరుస



సిక్సర్లు కొట్టి సూర్య మ్యాచ్ ను ఫినిష్ చేశాడు సూర్య, రోహిత్ రెండో వికెట్ కుఅజేయంగా 54 బంతుల్లోనే 114 పరుగులు జోడించడం విశేషం. చెన్నై బౌలర్లలో జడేజాకు ఏకైక వికెట్ దక్కింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ లో రాణించింది. స్టార్ ప్లేయర్లు జడేజా(35 బంతుల్లో 53:4 ఫోర్లు, 2 సిక్సర్లు), దూబె(32 బంతుల్లో 50:2 ఫోర్లు, 4 సిక్సర్లు) బాధ్యతగా ఆడి హాఫ్ సెంచరీ చేయడంతో ముంబై ముందు భారీ టార్గెట్ సెట్ చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్ల లో 5వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. 53 పరుగులు చేసిన జడేజా టాప్ స్కోరర్ గా నిలిచాడు. ముంబై బౌలర్లలో బుమ్రా రెండు.. సాంట్నర్, అశ్వని కుమార్, దీపక్ చాహర్ తలో వికెట్ పడగొట్టారు.

# మజ్లిస్‌ను గెలిపించేందుకు కుట్ర చేస్తారా..?

మొదటి పేజీ తరువాయి

బర్కత్‌పురా బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి బండి సంజయ్ శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ స్థానిక ఎమ్మెల్సీ ఎ న్నికలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాముడి వారసులెవరో, రజకార్ వారసులెవరో ప్రజలకు తెలుసునని కీలక వ్యాఖ్యలు చేశారు. కార్పొరేటర్లు విప్‌కు భయపడి ఓటింగ్‌కు దూరమైనా, మజ్లిస్‌కు ఓటేసినా మీ రాజకీయ భవిష్యత్తు ఖతమేనని అ న్నా రు. జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ దూరంగా ఉండాలని బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయంపైనా, ఎన్నికల్లో పోటీ చేయని కాంగ్రెస్ పైనా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు.

**ఎన్నికలకు దూరంగా ఉండేది నక్సలైట్లే..**

ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు దూరంగా ఉండేది, ఓటింగ్ ను బహిష్కరించేది నక్సలైట్లు మాత్రమేనని అన్నారు. ఆ నక్సలైట్ల వారసులే కాంగ్రెస్, బీఆర్ఎ స్ నేతలని మండిపడ్డారు. అలాంటి పార్టీలను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విప్‌లకు భయపడి ఓటింగ్‌కు దూరంగా ఉన్నా, మజ్లిస్ పార్టీని గెలిపించినా ఆయా పార్టీల కార్పొరేటర్ల రాజకీయ భవిష్యత్తు ఖతం కాబోతోందని హె చ్చరించారు. తెలంగాణలోని 85 శాతం హిం దువులంతా తీవ్రమైన ఆగ్రహంతో ఉన్న విషయా న్ని గుర్తు చేశారు. విప్ లకు భయపడి నిర్ణయం తీసుకుంటారో, ఓటింగ్ కు హాజరై మజ్లిస్ ను ఓడిస్తారో తేల్చుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కా ర్పొరేటర్లకు సూచించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఆ రెండు పార్టీలు పోటీ చేయకుండా మజ్లిస్ ను గెలపించాలని చూస్తున్నాయన్న ఆయన 15 నిమిషాలు టైమిస్తే హిందువుల ను నరికి చంపుతామన్న మజ్లిస్ తో కలిసి ఆ రెండు పార్టీలు అంటకాగుతున్నాయని ఆరోపించా రు. హిందువుల మనోభావాలను వివరించి బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావును గెలిపించాలని కో రారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, డాక్టర్ మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, గౌతమ్ రావు, రాంచంద్రరావు, లంకల దీపక్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, గుండగోని భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఉప ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

చెరిపేస్తామని ఎవరన్న అనుకుంటే అది వారి అజ్ఞానం. రేవంత్ రెడ్డి మీద నోరుపారేసుకుని మన నోరును కరాబ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎవరికి తెలంగాణ మీద ప్రేమ ఉంటది.. రైతులకు, పేదలకు, విద్యార్థులకు, మహిళలకు లాభమైతది అని చర్చ పెట్టాలి అని కేటీఆర్ సూచించారు.

**బీజేపీది మత పిచ్చి తప్ప మరేం లేదు..**

బీజేపీ దేశంలో మతం పిచ్చి లేపడం తప్ప చేసిందేమీ లేదు. ప్రపంచ ర్యాంకుల్లో వివిధ రంగాల్లో వెనక్కి పోతున్నాం. రేవంత్ నాయకత్వంలో తెలంగాణ వెనక్కి పోయినట్టే.. మోదీ నాయకత్వంలో దేశం వెనక్కి పోతుంది. నెగిటివ్ పాలిటిక్స్ తప్ప బీజేపీ చేసిందేమీ లేదు. మనం కేంద్రానికి ఇచ్చేది రూపాయి అయితే వాపస్ 45 పైసలు వస్తుంది. ఈ దేశానికి సాదుతున్న రాష్ట్రాల్లో మన తెలంగాణ కూడా ఒకటి. మత పిచ్చి అనేది మంచిది కాదు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయకూడదు. హిందువులు ప్రమాదంలో ఉన్నారట. 2014 వరకు మంచిగా ఉన్న హిందువులు ఇప్పుడు ప్రమాదంలో ఉన్నరట. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లేని పంచాయితీ ఇప్పుడు ఎందుకు కొత్తగా పె



డుతున్నారు. రాజకీయం కోసం దేశాన్ని విడగొడుతున్నారు. మంచి పనులు చేసి ఓట్లు అడగాలి. హిందు, ముస్లిం, పాకిస్తాన్, జై శ్రీరాం, మోదీ.. ఈ ఐదు పదాలు చెప్పకుండా ఓట్లు అడిగేటోళ్లు ఎవరైనా ఉన్నారా..? అని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణకు సంబంధించినంత వరకు అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండు శత్రువులే అని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఫ్రీ బస్సుతో చిత్ర విచిత్రాలు..**

హైడ్రాతో ఆస్తులు కాపాడుతాం అంటున్నారు. చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, కేవీపీ రామచందర్ రావు, తిరుపతి రెడ్డి ఇండ్లను ముట్టరు. ఇక అలకగా దొరికే గరీబోళ్ల పైకి బుల్డోజర్లు పంపుతున్నారు. 24 గంటలు నెగెటివ్ పనులేనా.. పాజిటివ్ పనులు చేయరా..? అని కేటీఆర్ నిలదీశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మైండ్ స్పేస్ నుంచి శంషాబాద్ వరకు ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ పెడితే.. రద్దు చేశారు. ఎందుకు రద్దు చేశారని అధికారులను అడిగితే.. మీ భూములు ఉన్నాయని రద్దు చేసినట్లు చెప్పారు. భూములు ఉన్నట్టు కూడా నాకు తెలియదు. శంకుస్థాపన జరిగాక కూడా రద్దు చేశారు. తక్కువ ఖర్చుతో సౌలభ్యం మెరుగుపడుతది అని ఆలోచించి ఎయిర్‌పోర్టు మెట్రోకు శంకుస్థాపన చేశాం. ఫార్మా సిటీ రద్దు అంటూ ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, స్కిల్ సిటీ నడుపుతున్నారు. ఇంకో దిక్కు మూసీ అంటరు. కానీ రైతుబంధు, తులం బంగారం, రుణమాఫీ, స్కూటీలకు పైసల్లేవు. స్కాలర్‌షిప్‌లు కూడా లేవు. కానీ మూసీకి మాత్రం లక్షన్నర కోట్లు ఇస్తారట. మింగేతందుకు మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె పెట్టిండట.. ఫోజులు ఎందుకు..? అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆహా నా పెళ్లాంట సినిమాలోని కోడి కూర సీన్ మాదిరి రేవంత్ పాలన ఉంది అని కేటీఆర్ విమర్శించారు. కొత్త రేషన్ కార్డులు అని ఏడాదిన్నరగా సాగుతోంది. కోటి మందితో దరఖాస్తులు పెట్టించారు. ఒక్క కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ నెగెటివ్ పాలిటిక్స్‌తో పూర్తిగా విఫలమైంది. పేదవాడి మీద ప్రతాపం చూపెట్టి కాంగ్రెస్ పార్టీ ఖతైమ పోయే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ పేర్కొన్నారు. మేం పదేండ్ల ఉన్నాం.. ఆనవాళ్లు చెరిపేస్తాం అనలేదు. అది అనాగరిక చర్య. కాకతీయుల ఆనవాళ్లను కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు కూడా చెరిపేయలేదు. కానీ ఈ ప్రభుత్వం కిరాతక పనులు చేస్తుంది. మంచి పనులు చేయరు. చేసిన మంచి పనులను ఆపుతారు. అభివృద్ధికి అందరం సహకరిస్తాం. కానీ 16 నెలల్లో విధ్వంసం జరిగింది. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అన్నారు.. 500 రోజుల తర్వాత కూడా ఏ ఒక్క హామీ అమలు కాలేదు. ఒక్కటే ఒక్కటి ఫ్రీ బస్సు అమలు చేశారు. ఇప్పటి వరకు చూడని చిత్రవిచిత్రాలు బస్సుల్లో చూస్తున్నాం అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# రేషన్ కార్డుల్లో పేర్ల మార్పులో గందరగోళం

మొదటి పేజీ తరువాయి

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు జారీ చేస్తారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పకపోవడంతో పాత రేషన్ కార్డుల్లో పేర్లను అలాగే ఉండాలని అనుకుంటున్నారు. సర్వేలో కొన్ని చోట్ల కుటుంబసభ్యుల పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చే ప్రక్రియకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. పిల్లల వివరాలను యాప్ ఒక్కోసారి తీసుకోవడం లేదని సమాచారం.

**యాప్‌లో మార్పులు చేయాల్సిందే..**

ఇప్పుడు చేస్తున్న సర్వేలో చేర్పులు, మార్పులను క్షేత్ర స్థాయిలో చేసేలా యాప్‌ను రూపొందిస్తే బాగుంటుంది. దరఖాస్తుదారుల ఎదుటే పాత రేషన్ కార్డుల నుంచి పేరు



తొలగించి వెంటనే కొత్త రేషన్ కార్డులో చేరిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. ఈ విషయమై కామారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్ బాబు మాట్లాడుతూ సమస్యలు లేని దరఖాస్తులను వెంటనే లాగిన్ చేసి కమిషనర్‌కు పంపిస్తున్నామని అన్నారు. పాత రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నవారి విషయం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని తెలిపారు.

# కాంగ్రెస్ సర్కారుకు చిరంజీవి సపోర్ట్

- డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేద్దాం
- ప్రభుత్వంతో అందరం కలిసి నడుద్దాం
- వ్యసనాలకు బానిసలుగా మారొద్దన్న మెగాస్టార్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:
డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదామని మెగాస్టార్ పిలుపునిచ్చారు. గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్టు హైదరాబాద్ మాదాపూర్‌లో టీ.వర్క్స్ నుంచి మైహోం భుజా మీదుగా ఐటీసీ వరకు ఆదివారం మారథాన్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటుడు చిరంజీవి వర్చువల్ సందేశం పంపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం అందరు కృషి చేయాలన్నారు. వ్యసనాలకు బానిసలై కొందరు తమ కలలను దూరం చేసుకుంటున్నారని చెప్పారు. మాదకద్రవ్యాల కట్టడిపై ప్రభుత్వంతో పాటు అందరూ అవగాహన కల్పించాలని కోరారు. డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలిద్దామని విజ్ఞప్తి చేశారు.

ఓరల్ క్యాన్సర్ నివారణకు డ్రగ్స్, సిగరెట్, గుట్కా, పాన్ పరాగ్‌లకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా వైద్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి డ్యాన్స్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కార్యక్రమంలో మైహోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వర్ రావుతో పాటు పలురంగాల ప్రముఖులు, వైద్యులు పాల్గొన్నారు. కాగా, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగానే డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇక ఈ కార్యక్రమంలో ఇప్పటికే చిరంజీవి సహా పలువురు స్టార్ నటులు భాగస్వామ్యం అయిన విషయం తెలిసిందే. తాజాగా జూనియర్ ఎన్టీఆర్ సైతం తెలంగాణ ప్రభుత్వంతో చేతులు కలిపారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి యువత సహకరించాలని ఎన్టీఆర్ ఇప్పటికే పిలుపునిచ్చారు.



# 22 ఏళ్ల తర్వాత ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక

మొదటి పేజీ తరువాయి

ఇప్పుడలా కుదరదంటూ బరిలోకి దిగింది భారతీయ జనతా పార్టీ. పాతబస్తీపై పట్టున్న మజ్లీస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నిలబడింది. దీంతో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ రసవత్తరంగా మారింది. దాదాపు 22 ఏళ్ల తర్వాత ఏప్రిల్ 23వ తేదీన ఎన్నిక జరగనుంది.హైదరాబాద్ జిల్లా పరిధిలో జరిగే లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో బలాబలాలను పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబట్టలేదు. మెజారిటీ మెంబర్స్ ఉన్న ఎంఐఎం అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం అనుకున్న తరుణంలో సెకెండ్ హయ్యేస్ట్ మెజారిటీ ఉన్న బీజేపీ బరిలో దిగడంతో ఎన్నికల ఓటింగ్ అనివార్యమైంది. ఎంఐఎం తరపున మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ తరపున గౌతమ్ రావు అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.ఈ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు మొత్తం 112 ఓట్లు ఉండగా.. అందులో 81 మంది కార్పొరేటర్లు, 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మజ్లిస్ పార్టీకి 40 మంది కార్పోరేటర్లు, 9 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో 49 ఓట్ల బలం ఉంది. బీజేపీకి 19 మంది కార్పొరేటర్లు 6 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 25 మంది , బీఆర్ఎస్ కు 15+9 కలిపి 24. కాంగ్రెస్ 7+7 తో 14 సభ్యుల సంఖ్యాబలం ఉన్నాయి. ఎక్స్ అఫీషియో సభ్యుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇప్పటికే పోలింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, ఎంఐఎంకు మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ ఆశాభావంతో ఉంది. నామినేషన్ నాడే తమ గెలుపు లాంఛనం అంటూ ఎంఐఎం అభ్యర్థి ధీమా వ్యక్తం చేశారు. గెలుపు కోసం కావాల్సిన సరైన సంఖ్యాబలం లేకున్నా.. బల్దియాపై పట్టు బిగించేందు కాషాయనేతలు పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు కాంగ్రెస్, బీఆర్ఎస్ జట్టుగా ఎంఐఎంకు సహకరిస్తున్నాయని ప్రజలకు ప్రూవ్ చేయడం తమ లక్ష్యమని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు హైదరాబాద్ మహానగరంలో ఎంఐఎం ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు బీజేపీ గెలుపును కోరుకుంటున్నారని, అందుకనుగుణంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పోరేటర్లు కూడా తమకు ఓటేస్తారని బీజేపీ అభ్యర్థి గౌతం రావు అంటున్నారు. జాతీయ వాదానికి, జాతీ విద్రోహులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో డెఫినెట్ గా ఆయా పార్టీలను కాదని కార్పొరేటర్లు తనకు ఓటేస్తారని గౌతమ్ రావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ఏ ఎవైనా గెలుపోటములు లెక్కచేయకుండా పోటీ చేసే పార్టీ బీజేపీ అని.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆయన అన్నారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కమలనాథులు.. గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ నాటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఝలక్ ఇచ్చేలా తమకు ఉన్న 25 ఓట్ల కంటే అదనంగా ఓట్లు సాధిస్తామని అంటున్నారు. మరోవైపు ఇతర పార్టీల కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలతో మాట్లాడి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ పార్టీలోకి వస్తామన్న కార్పొరేటర్లకు పొలిటికల్ కేరీర్ గ్యారంటీ కూడా ఇస్తున్నట్లు సమాచారం. దీంతో చివరి క్షణం వరకు బీజేపీ ప్లాన్ ఎంతమేరకు వర్క్ అవుట్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గాలిపటం విజయబావుట ఎగురవేస్తుందా.. లేక నిజంగానే ఏదైనా మిరాకిల్ జరిగి కమలం వికసిస్తుందా వేచి చూడాలి.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
21.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
3
vishalabharathi Telugu Daily

## కుల పిచ్చిని వీడండి..

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ హిందూ సమాజానికి పిలుపునిచ్చారు. "ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక" అనే సూత్రానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని ఆయన కోరారు.అలీగఢ్‌లో 5 రోజుల పర్యటనలో ఉన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, హిందూ విలువల ప్రాముఖ్యతను చెప్పారు. "ఈ ప్రపంచంలో శాంతి సాధించడానికంటే ముందు, భారత్ సామాజిక ఐక్యత సాధించడం అవసరం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం (విలువలు), సాంస్కృతిక విలువలు, సంప్రదాయం, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల విభేదాలకు పూర్తిగా స్వస్తి పలకాలి" అని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.






# పత్తి పంటపై రైతులకు అవగాహన

మునుగోడు, విశాలభారతి:

పత్తి పంటలను ఆశించే చీడపీడలు,తెగుళ్ల పై రాశి కంపెనీ రీజినల్ మేనేజర్ ప్రదీప్ కుమార్ టి.ఎస్.ఎం. రోహిత్ లు రైతులకు అవగాహన కనిపించారు.ఈ సందర్భంగా రాశి సీడ్స్ వారి పత్తి పంట పై రైతు సమృద్ధి సదస్సును ఆదివారం మండల కేంద్రంలోని సత్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. అనంతరం రాశి సీడ్స్ లో కొత్త రకమైన రాశి స్విఫ్ట్ హైబ్రిడ్ సీడ్స్ ను రైతుల సమక్షంలో ఆవిష్కరించారు.గత సంవత్సరం రాశి స్విఫ్ట్ పండించి అధిక దిగుబడులు పొందిన రైతులను సన్మానించి ప్రశంస పత్రాలు అందించారు.ఈ సందర్భంగా రైతులు కొంక శ్రీనివాస్,నెల్లికంటి రాఘవేంద్ర,భూపతిరెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ రాశి స్విఫ్ట్ విత్తనాల వల్ల పంట తొందరగా చేతికొచ్చి రెండవ పంట వేయడానికి అనుకూలంగా ఉందని అన్నారు. ఎకరాకి 15 నుండి 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని గుడ్డి పత్తి లేని పంట పొందామని పేర్కొన్నారు.రాశి స్విఫ్ట్ విత్తనం రసం పీల్చే పురుగులను తట్టుకొని పత్తి ఏరడానికి సులువుగా ఉందని పెట్టుబడి ఖర్చు బాగా తగ్గిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది రైతులు,కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, నవీన్,భూపాల్, శ్యాంసుందర్, రమేష్, డిస్ట్రిబ్యూటర్స్ అన్నదాత పోలగోని స్వామి,బిందు ట్రేడర్స్ వడ్డెంపూడి శ్రీనివాస రావు, డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ షెడ్యూల్డ్ కాస్ట్ వర్గీకరణపై ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింప చేయడంలో అలాగే GO జారీ చేయడంలో కీలక పాత్ర వహించిన మంత్రికి, తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకులు, ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి గోపాల్ దాస్ హరినాథ్ కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే sc,st సబ్ ప్లాన్ అనేక కీలక అంశాలపై కూడా చర్చించారు





# ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. తద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని, ఇప్పటి వరకు ఆర్టీసీలో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని వెల్లడించారు. ఇప్పటికే మహాలక్ష్మి కోసం కొత్త బస్సులు కొనుగోలు చేశామని, ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సన్నద్ధం అయిందని మంత్రి పేర్కొన్నారు. మొత్తం 3,038 ఉద్యోగాల్లో 2,000 డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) పోస్టులు, 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్) పోస్టులు, 25 డిపో మేనేజర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టులు, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్) పోస్టులు, 11 సెక్షన్ ఆఫీసర్ ( సివిల్) పోస్టులు, 6 అకౌంట్ ఆఫీసర్స్ పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్ పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుద్యోగులకు పెద్ద పీఠ వేస్తూ దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లను క్యాలెండర్ ప్రకారం విడుదల చేయనున్నామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని బాగా ప్రిపేర్ కావాలని సూచించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఆర్టీసీ ఉద్యోగాలు భర్తీ చేయాలని భావించినప్పుడు ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతుండటంతో ఆర్టీసీ ఉద్యోగాల నోటిఫికేషన్ ఆలస్యం అయిందని మంత్రి తెలిపారు. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ పూర్తి కావడంతో త్వరలోనే ఆర్టీసీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాబోతుందని, దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# ప్లాస్టిక్ రహిత పల్లెలు

- గ్రామాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు
- కాంగ్రెస్ సర్కారు మరో ముందడుగు
- రాష్ట్రవ్యాప్తంగా 90 యూనిట్లు మంజూరు
- ఒక్కో యూనిట్‌కు రూ.64 లక్షలు కేటాయింపు
- అనుమతులు జారీ చేయనున్న కలెక్టర్లు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్లాస్టిక్ రహిత గ్రామాలపై దృష్టి సారించింది. తొలిసారిగా గ్రామాల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 90 యూనిట్లు మంజూరు చేసిన ప్రభుత్వం దీనికోసం నిధులను కూడా కేటాయించింది. ఒక్కో యూనిట్‌కు రూ.64 లక్షలు మంజూరు చేసింది. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద ఈ నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ యూనిట్ల నిర్మాణానికి కలెక్టర్లు అనుమతులు ఇవ్వనున్నారు. మండలాలకు కేంద్రంగా ఈ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని డీఆర్‌డీవోలను ప్రభుత్వం ఆదేశించింది. ప్రతిరోజూ కనీసం 700 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ యూనిట్‌కు చేరవేయాలనే నిబంధన పెట్టింది. ఆయా మండలాల క్లస్టర్‌లోని పంచాయతీల్లో రోజూ ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణాన్ని అంచనా వేయాలి, దాని ఆధారంగా యూనిట్ల స్థాపనకు సరైన ప్రదేశాలను గుర్తించాలని అధికారులకు సూచించింది. మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న భవనాలను ఈ యూనిట్ల కోసం వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీని ద్వారా కొంత వ్యయం తగ్గుతుందని భావిస్తున్నది. భవనం మొత్తం 2000 చదరపు గజాల కంటే తక్కువ ఉండకూడదని, ఎక్కడైనా తక్కువగా ఉంటే డీపీఆర్‌లో సూచించిన విధంగా నిర్మించుకోవచ్చని, రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్ కనెక్షన్లు, నీటి సౌకర్యం ఉన్న ప్రాంతంలోనే యూనిట్ ఏర్పాటు చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. యూనిట్ కోసం అవసరమైన అనుమతులు పొందిన తర్వాత పని మూడు దశల్లో గ్రౌండింగ్ చేసి జియో ట్యాగ్ చేయాలని ఆదేశించింది. ప్రతి యూనిట్‌పై ఎస్‌బీఎం లోగో, ట్యాగ్‌లైన్ పెయింట్‌తో వేయనున్నారు.

**స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.516 కోట్లు**

బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్ ప్లస్) పల్లెలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తున్నది. ఇందు కోసం స్వచ్ఛ భారత్ మిషన్ - గ్రామీణ్‌కు రూ.516.40 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కేంద్రం వాటా 60 శాతం కాగా రాష్ట్ర వాటా 40 శాతం ఉంటుంది. అయితే, దీనికి సంబంధించిన ఫైల్‌కు మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్ బీఎం) ద్వారా పనులు చేపట్టేలా కార్యాచరణ రూపొందించింది. పనులు వేగవంతం చేయాలని, చేసిన పనులకు ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేసేలా అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.ఈ ఏడాది 1,90,166 టాయిలెట్ల నిర్మాణం ఈ ఏడాది (202526) గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ నిధులతో ప్రభుత్వం వ్యక్తిగత టాయిలెట్ల నిర్మించబోతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 1,90,166 టాయిలెట్ల కోసం 228 కోట్ల 19లక్షల 2వేల రూపాయలు మంజూరు చేసింది. ఒక్కో టాయిలెట్ కోసం రూ.12,573 వేల చొప్పున కేటాయించింది. పర్యాటక, మతపరమైన ప్రదేశాలు, పాఠశాలలు, మార్కెట్ స్థలాలు, ఆసుపత్రులు, బస్ స్టాండ్‌లు, మండల కేంద్రాల్లో అవసరం, జనం రద్దీని బట్టి కామన్ సానిటేషన్ కాంప్లెక్స్‌లు (సాముహిక టాయిలెట్లు) నిర్మించనున్నది. ఇందు కోసం ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.3 లక్షల చొప్పున కేటాయించనుంది. మొత్తం 395 కామన్ సానిటేషన్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం రూ.11.85 కోట్లు మంజూరు చేసింది.

### వ్యర్థాలతో కొత్త ఉత్పత్తులు

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు గృహాలు, వ్యాపారాలు, రద్దీ ప్రాంతాలతోపాటు వివిధ వనరుల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రెసిన్ గుర్తింపు కోడ్‌లు (ఆర్ఐసీఎస్) ఆధారంగా వివిధ రకాల వస్తువులుగా మార్చుతారు. ప్రాసెస్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ లేదా ఇతర రికవరీ ప్రక్రియల ద్వారా మానవ అవసరాలకు ఉపయోగించే ఉత్పత్తులను తయారు చేస్తారు. పునర్వినియోగం చేయడానికి వ్యర్థాలను రీసైక్లింగ్ ప్రాసెస్ ద్వారా కొత్త ఉత్పత్తుల తయారీ ఉంటుంది. ఈ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

# విరాట్ కోహ్లీ సూపర్ నాక్..

- పంజాబ్ అడ్డాలో ఆర్సీబీ విక్టరీ
- 7 వికెట్ల తేడాతో విజయం




విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:

పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ముందుగా బ్యాటింగ్ కుదిగిన పంజాబ్ టీమ్ కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభసిమ్రన్ సింగ్ శుభారంభం ఇచ్చారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 26 బంతుల్లో 42 పరుగులు కొట్టారు. ప్రియాన్ష్ ఆర్య 22 పరుగులు, ప్రభసిమ్రన్ సింగ్ 33 పరుగులు చేసి ఔటైన తర్వాత పంజాబ్ ఇన్నింగ్స్ నెమ్మదించింది. ప్రియాన్ష్ 42 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఇద్దరూ కృనాల్ పాండ్యా బౌలింగ్ లో అవుట్ అయ్యారు. దీంతో పవర్‌ప్లేలో పంజాబ్ టీమ్ స్కోరు 60 పరుగులు దాటింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బ్యాట్ మళ్ళీ నిరాశపరిచింది. అతను 6 పరుగులు చేసి రోమియో షెఫర్డ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. కృనాల్ పాండ్యా అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. అతను ఔటైన తర్వాత మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. 68 పరుగుల వద్ద పంజాబ్ తన మూడో వికెట్ కోల్పోయింది. ఒకానొక దశలో 76 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది. నెహల్ వధేరా కూడా 5 పరుగులు చేసి రనౌటయ్యాడు. ఆ తర్వాత జోష్ ఇంగ్లీష్, శశాంక్ సింగ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ కలిసి 26 బంతుల్లో 36 పరుగులు జోడించారు. ఆ తర్వాత ఇంగ్లీష్ 17 బంతుల్లో 29 పరుగులు చేసి సుయష్ శర్మ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. చివరి ఓవర్లలో శశాంక్ సింగ్, మార్కో జెన్సెన్ కలిసి పరుగులు రాబట్టారు. శశాంక్ ఇన్నింగ్స్ కాస్త నెమ్మదిగా సాగింది. అతను 33 బంతుల్లో 31 పరుగులు మాత్రమే చేశాడు. జెన్సెన్ మాత్రం బ్యాట్‌తో చెలరేగాడు. 20 బంతుల్లో 25 పరుగులు చేశాడు. దీంతో పంజాబ్ 157 పరుగులకు చేరుకుంది.158 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫిల్ సాల్ట్ కేవలం 1 పరుగు చేసి అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. తొలి ఓవర్ ఆరో బంతికే ఆర్సీబీ తొలి వికెట్ కోల్పోయింది.తొలి వికెట్ త్వరగా పడిపోయిన తర్వాత విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్ RCB ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు పంజాబ్ బౌలర్లను చుక్కలు చూపించారు. 69 బంతుల్లో 103 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. లక్ష్య ఛేదనలో దేవదత్ పడిక్కల్ అర్ధశతకం సాధించాడు. అతను 35 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 61 పరుగులు చేశాడు. దీంతో ఆర్సీబీ ఛేదన సులువైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ నిరాశపరిచాడు. అతను 12 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. అయితే అతని వికెట్ పెద్దగా నష్టం కలిగించలేదు. అప్పటికే ఆర్సీబీ విజయానికి దగ్గరైంది.

**విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్**

తొలి ఓవర్ నుంచి క్రీజులో ఉన్న విరాట్ కోహ్లీ అద్భుతమైన నాక్ ఆడాడు. హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్ లో ఆర్సీబీకి విజయాన్ని అందించాడు. కోహ్లీ 54 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్సర్ సాయంతో 73 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ను ఆడాడు. 19వ ఓవర్ ఐదో బంతికి జితేష్ శర్మ సిక్సర్ తో ఆర్సీబీకి విన్నింగ్స్ రన్స్ కొట్టాడు. ఈ సీజన్ లో ఆర్సీబీకి ఐదో గెలుపు.

# కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాష్ దారుణ హత్య



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

కర్ణాటక మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)ఓం ప్రకాష్ దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం(ఏప్రిల్ 20) బెంగళూరులోని ఉన్నత స్థాయి హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లోని తన నివాసంలో అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. బీహార్‌లోని చంపారన్‌కు చెందిన 68 ఏళ్ల రిటైర్డ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారి, 1981 బ్యాచ్ అధికారి. తన మూడంతస్తుల ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. పదునైన ఆయుధం వల్ల గాయాలున్న అతని మృతదేహాన్ని అతని భార్య పల్లవి గుర్తించి, పోలీసులకు సమాచారం అందించిందని అధికారులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న వెంటనే సీనియర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై ఫోరెన్సిక్ బృందం దర్యాప్తు చేపట్టింది.ప్రాథమిక దర్యాప్తులో ఓం ప్రకాష్ దారుణ హత్యకు గురైనట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ప్రమేయం, బహుశా కుటుంబ వివాదం కారణంగానే జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఓం ప్రకాష్‌ను మూడుసార్లు పొడిచి చంపారని, హత్యకు ఉపయోగించిన కత్తిని నివాసం నుంచి స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబ వివాదం నేపథ్యంలో అతని భార్య పల్లవి, కుమార్తెను అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని ప్రకాష్ కొంతమంది సన్నిహితుల ముందు ఆందోళన వ్యక్తం చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.బెంగళూరు పోలీస్ కమిషనర్ బి దయానంద్ మాట్లాడుతూ, “ఆదివారం సాయంత్రం 4 నుండి 4:30 గంటల ప్రాంతంలో మాజీ డీజీపీ ఓం ప్రకాష్ మరణం గురించి సమాచారం అందిందన్నారు. ఆయన కుమారుడిని సంప్రదించి, ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై, వివరణాత్మక దర్యాప్తు జరుగుతుంది. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని సీపీ తెలిపారు. పదునైన ఆయుధాన్ని ఉపయోగించినట్లు తెలుస్తోందని, దానివల్ల చాలా రక్తాన్ని కోల్పోయి మరణానికి దారితీసిందని పోలీస్ కమిషనర్ బి దయానంద్ తెలిపారు.కర్ణాటక 38వ డీజీపీగా మార్చి 1, 2015న నియమితులైన ఓం ప్రకాష్ విశిష్టమైన కెరీర్‌ను కలిగి ఉన్నారు. ఆయన హోమ్ గార్డ్స్ కమాండెంట్ జనరల్‌తో సహా అనేక కీలక పదవులను నిర్వహించారు. అగ్నిమాపక, అత్యవసర సేవలు, పౌర హక్కుల అమలు, కర్ణాటక లోకాయుక్త, నేర పరిశోధన విభాగం (CID)లో పనిచేశారు. ఆయన రవాణా కమిషనర్‌గా కూడా సేవలందించారు. కార్వార్ జిల్లాలోని భట్కల్ ప్రాంతంలో మతపరమైన ఉద్రిక్తతలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఓం ప్రకాష్ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా, బెంగళూరులో జరిగిన రెండు ప్రధాన ఉగ్రవాద సంఘటనల దర్యాప్తులో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. 2013 ఏప్రిల్ 17న బీజేపీ ప్రధాన కార్యాలయం సమీపంలో జరిగిన బాంబు పేలుడు, 2014 డిసెంబర్ 28న జరిగిన చర్చ్ స్ట్రీట్ పేలుడు ఘటనల సమయంలో ముఖ్య భూమిక పోషించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
21.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




# పెళ్లి సందడిలో మెరిసిన కె.ప్రసాద్ రెడ్డి...!

**జహీరాబాద్ - విశాల భారతి:**

జహీరాబాద్ ప్రాంతంలో పలు వివాహ వేడుకలు సందడిగా సాగాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి ఈ వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచారు. కోహీర్ మండలంలోని పిచేర్యాగడి పాత తండాలో జరిగిన వేడుకతో పాటు,అందోల్ నియోజకవర్గంలోని కంకోల్‌లో ఖానాపూర్ మాజీ ఎంపీటీసీ గొల్ల దుర్గ ప్రసాద్ బంధువుల వివాహానికి ఆయన హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన కె.ప్రసాద్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, మాజీ ఎంపీటీసీ గొల్ల దుర్గ ప్రసాద్,కాంగ్రెస్ నాయకులు చౌవాన్ మేఘునాథ్,పలువురు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



# బీభత్సమైన గాలి దుమారం.. సహకరించిన పోలీసులు

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలంలోని పలు గ్రామాలలో సాయంత్రం వేళ గాలి దుమారంతో పాటు విపరీతమైన వాన చోటు చేసుకోవడం జరిగింది. అందులో భాగంగా చింతబాయి తండా గ్రామంలో చాలా బలమైన గాలిద్వారంతో రోడ్డుపై ఉన్న పెద్ద చెట్లు విరిగి రోడ్డుపై అడ్డంగా పడటం వలన రోడ్డుకు ఇరుపక్కల వెళ్లే వాహనాలకు ఇబ్బంది కరంగా మారడంతో దేవరుప్పుల ఎస్సై ఊర సృజన్ కుమార్ సిబ్బంది మరియు గ్రామస్తులు కలిసి రోడ్డుపై పడి ఉన్న చెట్టు కొమ్మలను ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తొలగించి రోడ్డు ప్రయాణికులకు సహకరించారు. తదనంతరం రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు పోలీసు అధికారులకు మరియు గ్రామ ప్రజలకు మేలు కల్పించి నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఘనంగా ఏపీ సీఎం చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలు

**పినపాక, విశాలభారతి:**

ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 75 వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా జరిగాయి. పినపాక మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు కేక్ కటింగ్ చేసి , స్వీట్లు పంచారు. అనంతరం ఆయన పరిపాలనా విధానాన్ని, అమలు పరచిన పథకాల గురించి కొనియాడారు. విజనరీ పాలనదక్షత కలిగిన నాయకుడిగా ఆయన ఇరు రాష్ట్రాల అభివృద్ధి కోసం చేసిన సేవలు , హైదరాబాద్ అభివృద్ధి ఆయన కృషే అన్నారు. అనంతరం ఆయన ఆరోగ్యంగా ఉండాలని, తెలంగాణలోనూ సీఎం చంద్రబాబు నాయుడు సేవలు కావాలని కోరుతూ పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు తోట వెంకటేశ్వరరావు, కోడి రెక్కల సత్యం, కొడిరెక్కల సమ్మయ్య, రెబ్బల వీరమోహన్ రావు, షేక్ నభి సాహెబ్, షేక్ పెంటు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



# పబ్బు శ్రీకాంత్ గౌడ్‌ను సన్మానించిన బత్తుల శ్రీశైలం గౌడ్

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో నూతన డైరెక్టర్ గా నియమితులైన పబ్బు శ్రీకాంత్ గౌడ్ ని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంతంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ తాజా మాజీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్ పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర్ శర్మ ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దండ అరుణ్ కుమార్,అన్నెమోని గోవిందరాజు, మామిడి రాములు,మునుకుంట్ల జంగయ్య, జక్కర్తి శేఖర్,మామిడి శివ కుమార్,మొగుదాల రాకేష్, అన్నెమోని శివాజీ,వర్కాల ప్రసాద్, బత్తుల వికాస్, సారథి పాల్గొన్నారు.

## మహంకాళి గూడెం ప్రజలకు ఉచిత వాహన సదుపాయం



**పాలకీడు, విశాలభారతి:**

ఆదివారం ఈస్టర్ పండుగ శుభ సందర్భంగా మహంకాళిగూడెం గ్రామం తెలుగు బాప్టిస్ట్ చర్చ్ మందిరంలో మహంకాలి గూడెం గ్రామానికి చెందిన కత్తి దానయ్య తన తండ్రి స్వర్గీయ శ్రీ కత్తి దేవసహాయం మాజీ ,విఆర్ఓ సేవలకు గుర్తుగా ఎవరైతే మిర్యాలగూడ లో ఆపరేషన్ చేయించుకుని, తిరిగి ఇంటికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారో, అట్టి వారికోసం ఉచిత వాహన సదుపాయం కల్పించడం జరిగింది. ఇట్టి దానయ్య ఉచిత వాహన సదుపాయం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. పాస్టర్ సుధాకర్ ఉచిత వాహన సదుపాయం పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

# హామీ ఇచ్చారు..అమలు చేశారు

- మాట నిలబెట్టుకున్న పటాన్ చెరు మున్నూరు కాపు సంఘం
- ఆచరణలోకి 'ఎం.కే' మహాలక్ష్మి పథకం
- పేదింటి ఆడబిడ్డలకు పెళ్లి కానుకగా పుస్తె మెట్టెలు, బట్టలు
- ఇద్దరికి ఇచ్చారు.. అందరికీ ఇస్తామంటున్నారు
- మహాలక్ష్మి పథకం..నిరంతరం కొనసాగిస్తాం
- పటాన్ చెరు మున్నూరు కాపు సంఘం నేతలు





**పటాన్ చెరు,విశాలభారతి**

మమ్మల్ని నమ్మండి..గెలిపించండి..సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం..మున్నూరు కాపుల ప్రతిష్ట పెంచుతామన్నారు.. 'ఎం.కే' మహాలక్ష్మి పథకం హామీ ఇచ్చారు.. ఎన్నికల్లో గెలిచారు..వెంటనే హామీని అమలు చేసి అందరితో శభాష్ అనిపించుకున్నారు పటాన్ చెరు మున్నూరు కాపు సంఘం నేతలు.. వివరాల్లోకి వెళ్తే..ఇటీవల పటాన్ చెరు మున్నూరు కాపు సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాయికోటి రాజుపై నాయికోటి బోజయ్య సంఘం అధ్యక్షునిగా విజయం సాధించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 7న అధ్యక్షునితో పాటు నూతనంగా ఏర్పాటైన సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అదే రోజు ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నూతన కార్యవర్గం రెండు కొత్త హామీలకు శ్రీకారం చుట్టింది. మున్నూరు కాపు సంఘ సభ్యులలో ఎవరైనా నిరుపేద ఆడబిడ్డ కల్యాణానికి పూస్తె మెట్టెలు ఇస్తామని, కుల సంఘ సభ్యులలో ఎవరైనా అకాల మృతి చెందితే, గతంలో 10 వేలకే పరిమితమైన దహన సంస్కారాల ఆర్థిక చేయూతను 21 వేలు అందించేలా నూతన కార్యవర్గం ఆమోదించింది. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీలన్నింటినీ విడతల వారీగా అమలు చేస్తామని అధ్యక్షుడు నాయికోటి భోజయ్య ప్రకటించారు. ఇందులో భాగంగా మున్నూరు కాపు సంఘం కొత్తగా ప్రారంభించిన ఎం.కే మహాలక్ష్మి పథకం ఆచరణలోకి వచ్చింది. సంఘం నాయకులు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పటాన్ చెరు మున్నూరు కాపు సంఘంలో సభ్యత్వం కలిగిన కుటుంబాలకు చెందిన పేదింటి ఆడబిడ్డల వివాహానికి పుస్తె, మెట్టెలతో పాటు చీర జాకెట్ లను అందజేశారు. ఆదివారం స్థానిక మున్నూరు కాపు సంఘం భవనంలో గోనెమ్మ బస్తి వాసులు అనసూయ కూతురు నవనీతకు, అలాగే నర్రబస్తి వాసులు మహేష్ కూతురు మౌనికలకు పుస్తె మెట్టెలు చీర జాకెట్ లను అందించి ఇచ్చిన హామీను నిలబెట్టుకున్నారు. మాట నిలబెట్టుకున్న సంఘం నేతలకు కుల సభ్యులతో పాటు అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ ఎంకే మహాలక్ష్మి పథకం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు నాయికోటి భోజయ్య, ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్ కుమార్, గౌరవ అధ్యక్షుడు బుచ్చయ్య, ముఖ్య సలహాదారుడు నర్ర బిక్షపతి , గౌరవ సలహాదారులు కాసాల శంకర్, నాయికోటి జీతయ్య, బాయికాడి పెంటయ్య, యంజాల యాదయ్య, ఉపాధ్యక్షులు నర్ర రామారావు, మైలారం అశోక్, యంజాల మల్లేష్, కార్యదర్శులు కొడకంచి భార్గవ్, మేకల జగదీష్, సహాయ కోశాధికారి యంజాల రాజేష్, సంయుక్త కార్యదర్శి నాయికోటి సత్యం, కార్యవర్గ సభ్యులు పాతూరి నర్సింగ్ రావు, యంజాల సాయి, ఉప్పరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# అపరిచితులు తారసపడితే సమాచారం ఇవ్వండి

- చింతలపాడు గ్రామాన్ని సందర్శించిన - ఎస్ఐ రాజ్ కుమార్

**పినపాక, విశాలభారతి:**

మండలంలోని చింతలపాడు ఆదివాసి గ్రామాన్ని ఏడుల్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ శనివారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సన్మార్గంలో ప్రయాణించి మంచి పేరు తెచ్చుకోనీ అందరికీ ఆదర్శంగా ఉండాలని అన్నారు. ఎలాంటి సమస్యలున్నా మమ్మల్ని సంప్రదించాలని అన్నారు అసాంఘిక శక్తులకు సహకరించకూడదని గ్రామాలకు కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. చిన్నారులకు స్వీట్స్, బిస్కెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా అన్నదానం

**కోదాడ, విశాలభారతి:**

ఏపీ సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో ఉన్న ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో కోదాడ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ఓరుగంటి ప్రభాకర్, సామాజిక ఉద్యమకారులు డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉన్న అనాథలకు, వృద్ధులకు, మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా అబిమాన నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ఇలా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అబివృద్ధి సంక్షేమం ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు సామాజిక సేవలో ముందు ఉన్నారని అన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పిల్లలకు ఉచిత విద్య వైద్యం అందిస్తున్నారని తెలిపారు. భవిష్యత్ లో తెలుగు దేశం పార్టీ తెలంగాణలో క్రియా శీలక పాత్ర పోషించే సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రజలకు సుపరిపాలన తెలుగు దేశంతోనే సాధ్యమని, క్రమశిక్షణకు మారు పేరు తెలుగు దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల గోపాల్ రావు, కొండ పావులూరి వెంకటేశ్వరరావు, అమరవరపు శ్రీమన్నారాయణ, బిజేపి నాయకులు జల్లా జనార్దన్ రావు, ఆశ్రమం నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# 20 క్వింటాళ్ల బెల్లం పటిక పట్టివేత

- ఎస్సై సృజన్ కుమార్

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలం సింగరాజు పల్లి గ్రామ పరిధిలో ఈరోజు తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో టోల్గేట్ వద్ద అనుమానాస్పదంగా ఒక టాటాఏసీ బండి కనిపించగా, ఆ బండి ఆపే ప్రయత్నం చేయగా, డ్రైవర్ అతి వేగంగా ఆపకుండా ముందుకు తీసుకెళ్ళి ఆపి పారి పోయినాడు, అదేవిధంగా వెంబడించి పట్టుకొని టాటా ఏసీలో ఏముందో చూడగా అందులో సుమారు 20 క్వింటాళ్లు నల్ల బెల్లం మరియు పట్టిక కలదు వెంటనే అట్టి టాటాఏసీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకొని వచ్చి కేసు నమోదు చేయడం జరిగింది. పారిపోయిన డ్రైవర్ యొక్క పేరు తెలుసుకోనగ జాటోత్ నవీన్ తొర్రూరు అని తెలిపారు .




# చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని

**దేవరుప్పల, విశాలభారతి:**

కామారెడ్డి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మరిపెల్లి మురళిస్వాతి దంపతుల కుమార్తె మనస్వి జన్మదిన వేడుక దేవరుప్పుల మండల కేంద్రంలోనీ గార్డెన్ లో జరగగా ఆ వేడుకలో పాల్గొని చిన్నారి మనస్విని ఆశీర్వదించిన ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు,కామారెడ్డి గూడెం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓడపెల్లి పుల్లయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు,మాజీ ఎంపీటీసీ మహమ్మద్ జాకీర్ హుస్సే, మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,గ్రామ ఉపాధ్యక్షుడు పులి పంపుల సురేష్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చింత నిఖిల్,నాయకులు మరాఠి స్వామి,జిలకర కిషన్,చింత ఉపేందర్,చింత ఉమేష్,మరాఠి మల్లయ్య,అజ్మతుల్లా,బానోతు వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
21.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## భారత్‌ను ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేద్దాం: కిషన్‌రెడ్డి

పంజాగుట్ట,విశాలభారతి

భారత్‌ను ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆనందనగర్ కాలనీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ కార్యాలయం నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐసీఎస్ఐ సేవలు భారత్‌లోనే ముందంజలో ఉన్నాయని కొనియాడారు. ఈ సెంటర్ అభివృద్ధి కోసం ఎంతో మంది కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్‌గా తయారు చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ ధనుంజయ్ శుక్లా, కౌన్సిల్ సభ్యుడు ఆర్.వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పవన్‌జీ చందక్, ఇండియా లిమిటెడ్ ప్రతినిధి ఎన్. జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



### కండర క్షీణత వ్యాధి బాధితులకు
# నిత్యావసరాల పంపిణీ

- ఆదుకుంటున్న దాతలందరికీ ధన్యవాదాలు
- టిఎండిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్

పటాన్ చెరు,విశాలభారతి

కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఇస్నాపూర్ తాజా మాజీ సర్పంచ్ గడ్డం బాలమణి శ్రీశైలం సహకారంతో నిత్యవసర వస్తువులను అందజేశారు. శ్రీ విశ్వావసు నామ ఉగాది సంబరాల సందర్భంగా తీవ్ర వైకల్య దివ్యాంగులకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన తీవ్రవైకల్యం దివ్యాంగులకు నిత్యవసర వస్తువులు ఇవ్వడంతో పాటు ఆటో కిరాయిలకు సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మాజీ సర్పంచ్ శ్రీమతి గడ్డం బాలమణి, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం లకు తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టిఎండిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం దాతలు సహకారంతో తీవ్ర వైకల్య దివ్యాంగుల సహాయార్థం 2024 ఏప్రిల్ నుండి 2025 మార్చి వరకు నిర్వహించిన కార్యక్రమాలకు 42 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. సహకరించిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ హనుమంతు, సామాజిక కార్యకర్త బాపు వెంకన్న, కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం నాయకులు వెంకోబా, అన్వర్, శేఖర్, యువ చైతన్య ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు కంచిగారి మహేష్ కుమార్, కంచిగారి శ్రీనివాస్, కంజర్ల జ్యోతి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి పూట విషవాయువులు

- విలవిలాడిన చిన్నారులు
- పటాన్ చెరు పరిధిలో ఘటన

పటాన్ చెరు,విశాలభారతి








జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్ చెరు డివిజన్ చైతన్య నగర్ కు అనుబంధంగా ఉన్న నవ్య ది గ్రాండ్ కాలనీలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో విష వాయువులతో పలువురు చిన్నారులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మాములుగా అందరు భోజనం చేసి నిద్రకు ఉప క్రమించే తరుణంలో ఒక్కసారిగా శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. విషవాయువుల కారణంగా ఇబ్బంది పడినట్టు కాలనీ సంక్షేమ కమిటీ సభ్యులు చెప్పారు. ఈ ఘటనపై వారు ప్రధాన కూడలి వద్ద సమావేశం అయ్యారు. వారంలో ఒకసారి ఇలాగే జరుగుతుందని, కాలుష్య నియంత్రణ మండలి వారికి పిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని కాలనీ కమిటి బాధ్యులు కెవి రవీందర్, హర గోపాల్, నవీన్, సుశీల్, వెంకటేశ్, శ్రీకాంత్ లు ఆరోపించారు. సమీపంలోని వాగులో రసాయన వ్యర్థ జలాలు రాత్రి వేళ దొంగతనంగా వదులుతున్నారని తెలిపారు. వెంటనే కమిటీ సభ్యులు వాగు వెంబడి పరిశీలన చేశారు. సిల్వర్ ఓక్స్ స్కూల్ వద్ద చీకట్లో ఎవరూ లేనిది చూసి అక్కడే వ్యర్థ జలాలు వదులుతున్నారని నిర్ధారణకు వచ్చారు. లారీ వెళ్లిన గుర్తులు కూడా ఫోన్ లో ఫోటోలు తీసి పెట్టుకున్నారు. మరోవైపు విష వాయువులు వెలువడగానే కొందరు కాలుష్య నియంత్రణ మండలికి ఫోన్ చేసి పిర్యాదు చేశారు. మరో వైపు అస్వస్థతకు గురైన 3 గురు చిన్నారులను సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. రాత్రి 11 గంటల సమయంలో పిర్యాదు అందుకున్న అధికారులు కాలుష్యం నమోదు చేసే యంత్రం తీసుకుని కాలనీకి చేరుకున్నారు. ఒక్కో దగ్గర ఒక్కో విధంగా మిషన్ కాలుష్యం సూచీ చూపించింది. 5 పాయింట్ల నుండి 12 పాయింట్ల వరకు కాలుష్యం నమోదు అయింది. విషయం తెలుసుకున్న సనత్ నగర్ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయ అధికారులు సైతం 12 గంటల ప్రాంతంలో కాలనీకి చేరుకుని మరొక సారి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రతీ వారం ఇలాగే జరుగుతుందని, మరొక సారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కమిటీ బాధ్యులు కోరుతున్నారు.

## జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా మాల్ ఎంపిక

- కార్యదర్శి రాజుకు వెల్లువెత్తుతున్న అభినందనలు
- ఇది అందరి విజయం జీపీ కార్యదర్శి రాజు

ఇబ్రహీంపట్నం,విశాలభారతి :



రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మాల్ గ్రామపంచాయతీ జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక యింది. ఆత్మ నిర్భార్ విభాగంలో ఎంపిక చేసినట్లు యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.రూ. కోటి పారితోషికం ఇవ్వనున్నారు.ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేశంలో గ్రామ పంచాయతీలకు పనితీరుపట్టి వివిధ కేటగిరీలో ఎంపిక చేసి ఉత్తమ గ్రామపంచాయతీలుగా ప్రకటిస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యాచారం మండలంలో మాల్ గ్రామపంచాయతీ ఉత్తమ అవార్డు, అందుకోవడం ఆయన హర్ష వ్యక్తం చేశారు.మండల అధికారులను గ్రామపంచాయతీ సెక్రటరీ రాజును, పారిశుద్ధ్య కార్మికులను ఆయన అభినందించారు.

**ఇది అందరి విజయం.**

**మాల్ సెక్రటరీ, రాజు**

తెలంగాణ రాష్ట్రంలో యాచారం మండలం లోని మాల్ గ్రామపంచాయతీకి ఉత్తమ అవార్డు రావడం ఆనందంగా ఉందని గ్రామ సెక్రెటరీ రాజు ఆనందం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు బాగుంది. యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంపీఓ శ్రీలత, ఎన్ ఆర్ జి ఎస్ అధికారులకు, కృతజ్ఞతలు తెలిపారు.



## ఓయూలో చంద్రబాబు నాయుడు బర్త్ డే సందర్భంగా తల సేమియా చిన్నారులకు రక్తదానం

విశాలభారతి,ఓయూ:

ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 75వ,పుట్టినరోజు సందర్భంగా CBN ఫ్యాన్స్ అసోసియేషన్ , స్కూల్ ఆఫ్ CBN ఆధ్వర్యంలో,ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ జాతీయ అధ్యక్షుడు తలారి. శ్రీనివాసరావు " తలసెమియా " చిన్నారులకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు 4 సార్లు సీఎంగా,3 సార్లు ప్రతిపక్ష నేతగా తెలుగుదేశం పార్టీని గత 40 సంవత్సరాలుగా బలోపేతం చేయడంలో ఆయన కృషి, చొరవ, శ్రమ ఎనలేనిదన్నారు. దేశంలో 3 ప్రధానులు నియామకం లో ఆయన రాజనీతి గొప్పదని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు, అభివృద్ధి లో అయన దూరదృష్టి చాలా గొప్పదన్నారు. 75 ఏళ్ల లో వయస్సులో ఫిట్ నెస్ కి కేరాఫ్ అని, టీడీపీ ని గడిల నుండి గల్లీల్లోకి పాలన తీసుకు వచ్చిన జన్మభూమి సృష్టికర్త అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ CBN నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 21 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.వారికి సర్టిఫికెట్స్ అందజేశారు.

**ఆదివారం రాత్రి సంబురాలు.**

గత రాత్రి పూట ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ఉపాధ్యక్షులు రత్నవాలి, క్యాంప్ ఇంచార్జ్ వంశీ,పవన్ తో పాటుగా వేమూరి నరేష్, మురళీ, నాగరాజు, వినయ్, సతీష్ ,గోపి , వర ప్రసాద్, వినయ్, వికాస్ ,అభిలష్ ,అభిలాష్, కళ్యాణ్, రాజ్ కుమార్, రాము,మహేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.





## ఘనంగా నారాచంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు

సికింద్రాబాద్,విశాలభారతి:

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు సికింద్రాబాద్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నామాలాగుండులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెదేపా సీతఫల్మండి డివిజన్ అధ్యక్షుడు క్రిష్ణ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా సీతాఫలమండిలోని అమన్ వేదిక, రెయిన్బో అనాధ పిల్లల ఆశ్రయంలో 100 మంది పిల్లలతో కేక్ కట్ చేసి పిల్లలందరికీ పంచిపెట్టారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, గరిగే ప్రవీణ్, చిరంజీవిరాజు, సుదర్శన్ రెడ్డి, పిట్ల శంకర్ ముదిరాజ్, చందర్ ముదిరాజ్, వెంకటస్వామి, నాయుడు, టెంట్ హౌస్ శంకర్, నరేంద్ర, చంద్రమోహన్, పుప్పాల విజయ్ కుమార్, రాహుల్, సీనియర్ నాయకురాళ్లు శేషిరేఖ, సరస్వతి, సాయి తదితరులు పాల్గొన్నారు.





### జై భవాని పుబగ్
## నాన్- వెజ్ -మార్ట్ ను ప్రారంభం

మాజీ ఓ బి సి నేషనల్ కమిషన్ సభ్యులు తాలోజు ఆచారి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

హయత్ నగర్ డివిజన్ లోని సూర్య నగర్ కాలని నందు జై భవాని పుబగ్ నాన్ వెజ్ మార్ట్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా మాజీ ఓబీసీ జాతీయ నేషనల్ కమిషన్ సభ్యులు తలోజు ఆచారి స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మార్ట్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటిస్తూ కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు, ఈ కార్యక్రమం లో నిర్వాహకులు సందీప్ కుమార్, డివిజన్ బీజేపీ నాయకులు నర్సింహా , అరుణ్ , బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు ఎర్ర ప్రేమ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యాధికారమే" లక్ష్యంగా పోరాడాలి

- బహుజనులు బానిసత్వాన్ని వదిలేయాలి
- అంబేద్కర్ ఆశయాల కోసం కృషి చేయాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య

బోడుప్పల్ , విశాలభారతి:

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 322వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది .ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బండారి స్వామి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.నత్తి మైసయ్య మాట్లాడుతూ దళిత,బహుజనులు బానిసత్వాన్ని వదిలి,రాజకీయ పార్టీలను నమ్మి మోస పోకుండా, బహుజన రాజ్యాధికారం కోసం ప్రతి బహుజన బిడ్డ నడుము కట్టి,పిడికిలి బిగించాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఎన్నికల సమయం రాగానే ప్రతి రాజకీయ పార్టీ అంబేద్కర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జపం చేస్తూ ఓట్లు దండుకుని, గద్దెకిక్కగానే అంబేద్కర్ ఆశయాలు, ఆకాంక్షలు విస్మరిస్తున్నారని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన సొంత కుటుంబ సభ్యులకు లేదా గుప్పెడు జనం ఉన్న అగ్రవర్ణాలే కీలక పదవులు అనుభవిస్తు దళిత బహుజనలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు ఇకనైనా బహుజనులు చైతన్యవంతం కావాలని, ప్రతి బహుజనుడు పార్టీలు పక్కకు పెట్టి బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూపతి రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య,రాపోలు శ్రీరాములు,నత్తి దర్శన్,కామగల బాబు,మైసగళ్ళజానీ,సిల్ల అంజయ్య,గరుగుల యాకయ్య, బండారి సాయి,ఏసు రాజు,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
21.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## టేకులపల్లిలో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం

**టేకులపల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేయనున్న భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు స్థానికంగానే పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఆదివారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందఅన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో రైతులు బాగా ఇబ్బంది పడ్డారన్నారు. కొత్తగూడెం ఆర్డీఓ మధు, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ రవీందర్ రావు, పాక్స్ ఛైర్మన్ లక్కినేని సురేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



## వస్పరి కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశం

- పాల్గొన్నా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** హయత్ నగర్ డివిజన్ లోని వస్పరి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని కాలనిలోని ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు ,ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనిలో ప్రధానంగా భూగర్భ డ్రైనేజీతో పాటు సీసీ రోడ్ల సమస్యను కార్పొరేటర్ కి వివరించడంతో వారు స్పందించి వస్పరి కాలనీలో భూగర్భ డ్రైనేజీ ను సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగిందని, అతి త్వరలోనే పనులు కూడా ప్రారంభం కావడం జరుగుతుందని వారు కాలనీవాసులకు తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బాల్ రెడ్డి , నర్సింహా రెడ్డి , రామ్ దాస్ , శ్రీనివాస్ , లింగ రెడ్డి , వెంకట్ రెడ్డి , శ్రీనివాస్,శ్రవణ్ కుమార్ , గోవర్ధన్ , ప్రభుదాస్ , వెంకన్న , రాజు , నర్సింహా రాజు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదంతో పరిష్కారం

- బిఆర్ఎస్ నాయకులు,జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్.



**సూర్యాపేట,విశాలభారతి:** దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదంతో శాశ్వత పరిష్కార మార్గం ఉంటుందని బిఆర్ఎస్ నాయకులు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం 45 వార్డు విద్యానగర్ లోని గండూరి జానకమ్మ రామస్వామి వాటర్ ప్లాంట్ నందు గండూరి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీ దరీయం ఆయుర్వేద నేత్ర క్లినిక్ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేదం అనేది అతి పురాతన కాలం నుండి ఉంది అని ఇంగ్లీష్ మందులు,హాలోపతి మందులు వాడితే అప్పటి వరకె ఉపశమనం ఉంటుందని ఆయుర్వేద మందులు వాడితే శాశ్వత నివారణ ఉంటుందని తెలిపారు. ఇప్పుడు డయాబెటిస్ అనేది పదిమందిలో ఆరుగురికి వస్తుందని మనం తినే ఆహారం లోపం వలన డయాబెటిస్ వస్తుందని దానికి కూడా ఆయుర్వేద మందులు వాడితే శాశ్వత నివారణ ఉంటుందని తెలిపారు. ఈ క్యాంపులో కంటి మచ్చల క్షీణత, ఆప్టిక్ న్యూరోపతి, కంటి నీటి కాసులు, దూరదృష్టి లోపం, సమీప దృష్టిలోపం, నిరంతర పోడి కన్నులు కండ్ల కలకలు, కీళ్లవాతం కీళ్లలో క్షిణించడం, వెన్నెముక సంబంధిత సమస్యలు, జ్ఞాపకశక్తి సమస్యలు వెన్ను నరాల నొప్పి, ఉబ్బిన నరాలు తదితర వ్యాధులకు చూస్తున్నారని అవకాశాన్ని వార్డు, సూర్యాపేట పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ దాస్, శ్రీ ధరీయం బ్రాంచ్ మేనేజర్ పవన్, బెలిదే శ్రీనివాస్, దేవిరెడ్డి రవీందర్ రెడ్డి, గుండా లక్ష్మయ్య, నూకల వెంకటరెడ్డి, ఉప్పల రాజేంద్రప్రసాద్, కుక్కడప్పు బిక్షం, రాచకొండ శ్రీనివాస్, సవరాల సత్యనారాయణ, బోనగిరి భాస్కర్, కక్కిరేణి చంద్రశేఖర్, సందీప్, కళ్యాణ్, ఇస్మాయిల్, ఎండి లతీఫ్, మురారిశెట్టి జోగయ్య, మిర్యాల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు

**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారాసిగూడ చౌరస్తాలో తెదేపా బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు గరిగే ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి తెదేపా సికింద్రాబాద్ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక కేక్ కట్ చేసి, అనంతరం పళ్ళు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, వెంకటస్వామి, నరేంద్ర, టెంట్ హౌస్ శంకర్, పిట్ల శంకర్ ముదిరాజ్, పొట్టిశీను, చంద్ర మోహన్, దేవేందర్, సుధాకర్, రవి, చిరంజీవిరాజు, చందర్ ముదిరాజ్, నాయుడు, పుప్పాల విజయ్ కుమార్, రాహుల్, డెంటల్ ప్రవీణ్, సీనియర్ నాయకురాలు శేషిరేఖ తదితరులు పాల్గొన్నారు.




## క్రికెట్ ఆడుతూ గుండేపోటుతో యువకుడు మృతి

**కీసర, విశాలభారతి:** కీసర రాంపల్లి దయారా త్యాగి క్రీకెట్ గ్రౌండ్ లో క్రికెట్ ఆడుతూ ప్రణీత్ అనే వ్యక్తి ఊపిరి ఆడక కింద పడిపోయాడు. పక్కనే ఉన్న తోటి వారు అంబులెన్స్ లో చిర్యాల్ ఎక్స్ రోడ్డులో ఉన్న విజయ్ ట్రామా హాస్పటల్ కి తరలించారు.అప్పటికే ప్రణీత్ మృతి చెందరు అని నిర్ధారించిన వైద్యులు. గుండెపోటు అయి ఉండొచ్చని వైద్యులు పేర్కొన్నారు. మృతుడు ప్రణీత్ (32) నివాసం బోయిన్పల్లి కెనరా బ్యాంక్ ఉద్యోగి.ఇదే కెనరా బ్యాంక్ లో పని చేసిన ప్రణీత్ తండ్రి జగదీష్.ఇటీవల కొన్ని నెలల క్రితం జగదీష్ మృతి చెందరు.అదే బ్యాంక్ లో ప్రణీత్ ఉద్యోగం చేస్తున్నాడు.ఆదివారం ఉదయం ప్రణీత్ తన ఫ్రెండ్స్ తో కలిసి క్రికెట్ ఆడడానికి త్యాగి క్రికెక్ట్ గ్రౌండ్ కి వచ్చాడు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్న కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.



## బాలెంలలో వట్టె జానయ్య అభిమాని విగ్రహాన్ని ఆవిష్కరణ

- తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ సమన్వయ కర్త వట్టె జానయ్య యాదవ్.

**సూర్యాపేట, విశాలభారతి:** సూర్యాపేట మండల పరిధిలోని బాలెంల గ్రామానికి చెందిన వట్టె జానయ్య యాదవ్ వీరాభిమాని శివరాత్రి చిరంజీవి ఇటీవలే ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ లో మరణించడం జరిగింది. ఆదివారం చిరంజీవి సంవత్సరికం సందర్భంగా బాలెంల గ్రామంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చిరంజీవి విగ్రహన్ని తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ సమన్వయ కర్త వట్టే జానయ్య యాదవ్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జానయ్య యాదవ్ మాట్లాడుతూ.. అహర్నిశలు తన కోసం శ్రమించిన ఒక గొప్ప కార్యకర్త ను కోల్పోవడం చాలా బాధాకరం అని,ఆ కుటుంబ సభ్యులకు అండగా ఎప్పుడు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారేపల్లి ప్రభాకర్, కేశబోయిన మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, మీర్ అక్బర్, బడుగుల నాగార్జున యాదవ్, వల్లాల బుచ్చయ్య యాదవ్, మామిడి తిరుమల్,వెంకటేష్ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యేసు క్రీస్తూ మరణం పై విజయమే ఈస్టర్

- బేతెస్థ సంఘంలో పాదశుద్ధి..
- బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు
- బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా.



**సూర్యాపేట,విశాలభారతి** యేసు క్రీస్తూ మరణం పై విజయమే ఈస్టర్ పండుగని బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 4వ వార్డు కాశీంపేట బేతెస్థ మినిస్ట్రీస్ చర్చిలో ప్రపంచ క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. మరణంపై యేసు గెలిచిన విజయోత్సవంగా యేసు క్రీస్తు పునరుత్థానాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఈస్టర పండుగ జరుపుకుంటారన్నారు. ప్రపంచం మొత్తంలో కాలిగా ఉన్న సమాధి ఒక్క యేసుక్రీస్తు ప్రభుదే అనీ కొన్ని వేల సంవత్సరాల క్రితం ఎంతో మంది ప్రవక్త లు ప్రవచించిన విదంగా ఆయన ఈ లోకానికి వచ్చి సిలువ వేయబడి చనిపోయి తిరిగిలేచడని తెలిపారు.ఈ సందర్భంగా చర్చ్ లో యేసు ప్రభు శిష్యుల పాదాలు కడిగి సేవా చేసిన విధంగా ఈ రోజు సంఘం లో పాదశుద్ధి కార్యక్రమం చేసి చూపించారు.ఈ కార్యక్రమంలో యేసుపాదం, బాబు, కిరణ్, భాస్కర్,జానయ్య, సురేష్, పేతురు, అంజి తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

- శబరినగర్ అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు.

**సూర్యాపేట,విశాలభారతి:** సూర్యాపేట అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని శబరి నగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం అధ్యక్షులు బెలిదే శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో బాటసారులు, ప్రయాణికులు, భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన చలివేంద్రం ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించుటకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రములో వారంలో ఆరు రోజుల పాటు మంచి నీటిని, ప్రతి బుధవారం మజ్జిగను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా నెలలో ఒక ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఒక నిరుపేద విద్యార్థికి ఉచిత విద్యను అందించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తామన్నారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు భక్తులందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సముద్రాల రామకృష్ణ శర్మ, కార్యదర్శి ఎల్గూరి రాంబాబు గౌడ్, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, ఆలయ గురుస్వామి గొట్టేముక్కల శ్రీనివాసరెడ్డి, అన్నదాన నిర్వహణ కమిటీ చైర్మన్ సంకురుశెట్టి చంద్రశేఖర్, అన్నదాన నిర్వహణ కమిటీ కన్వీనర్ జటంగి రవి యాదవ్, ఆడిట్ కమిటీ సభ్యులు మట్టపల్లి రాధాకృష్ణ, శ్రీపాద భాస్కర చారి, కమిటీ సభ్యులు మారంసాయి వెంకటేశ్వరరావు, జెపిటి గురుస్వామి, పొలా రాధాకృష్ణ, సంకురుశెట్టి పరమేష్, మిర్యాల సంపత్ కుమార్ ,రాచర్ల వెంకటేశ్వర రావు, పాల్వాయి రవీందర్, బికే రాజు, మనసాని రామ్మూర్తి, మనసాని నాగేశ్వరరావు,వేమిశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు చీమల దండులా కదిలి రావాలి

- బిఆర్ఎస్ నాయకులు వర్నే మోహన్ రావు.



**సైదాపూర్,విశాలభారతి;** కాంగ్రెస్ ప్రభుత్వం కాలం ఒడిసిందని 16 నెలల పాలనలో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వస్తుందని మూడున్నర ఏండ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి గులాబీ పార్టీ వస్తుందని బిఆర్ ఎస్ నాయకులు వర్నే మోహన్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల రజతోత్సవ బహిరంగ సభను చీమల దండులా తరలివొచ్చి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పదేండ్ల కేసీఆర్ పాలన స్వర్ణ యుగమన్నారు.అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లోనే హామీలను తుంగలో తొక్కి, ఆరు గ్యారెంటీలను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని అయిపోయిందని, మూడున్నరెండ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయే అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ మరో ఇరవై ఏళ్ల వరకు అధికారంలోకి రాదన్నారు. త్వరలో పంచాయితీ ఎన్నికలు రానున్నాయి అధిక శాతం సీట్లలో మన పార్టీ అభ్యర్థుల గెలుపొందాలని వారికోసం పార్టీ కార్యకర్తలు అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఐక్యమత్యంతో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండ కట్టాలన్నారు. 25 ఏళ్ల బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు పండుగలా నిర్వహించుకుందామని అన్నారు..



## ఘనంగా పెద్దిరెడ్డి రాజా జన్మదిన వేడుకలు

**సూర్యాపేట,విశాలభారతి:** మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా జన్మదిన వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురు నాయకులు,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిలో పెద్దిరెడ్డి రాజా ఎనలేని కృషి చేశారని అన్నారు.అనంతరం పెద్దిరెడ్డి రాజా కుమారుడు పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దిరెడ్డి రాజా కుమారుడు పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా, పెద్దిరెడ్డి రాజా సోదరులు పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి చంద్రశేఖర్, పెద్దిరెడ్డి కృష్ణ,నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, నేరెళ్ల మధు గౌడ్, గుడిపూడి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, షఫీ ఉల్లా, నిమ్మల వెంకన్న, గోదాల రంగారెడ్డి, రాచకొండ శ్రీనివాస్, మీలా వంశీ,సూరయ్య,గోపగాని గిరి,ధర్మా నాయక్, సకినాల కృష్ణ, కారింగుల వేణు, గుణగంటి మధు, గాలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
సోమవారం,
21.04.2025
హైదరాబాద్


cinema updates



# క్లైమాక్స్‌లో శివుణ్ని చూసి ప్రేక్షకులు దండం పెడుతున్నారు!

“ఓదెల 2’ నాకు సాధ్యమయ్యే కథ కాదు. ఆ పరమశివుడే దీన్ని నాతో రాయించాడని నమ్ముతున్నా. నా మనసులో ఎప్పటికీ ఉండిపోయే ప్రత్యేక చిత్రమిది” అన్నారు దర్శకుడు సంపత్ నంది. ఆయన సూపర్ విజన్‌లో తమన్నా ప్రధాన పాత్రధారిగా అశోక్ తేజ తెరకెక్కించిన చిత్రమే ‘ఓదెల 2’. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. వశిష్ఠ ఎన్ సింహా, హెబ్బా పటేల్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు సంపత్ నంది మాట్లాడుతూ.. “ఆ పరమశివుడు లేకుండా ఈ చిత్రం లేదు. దీంట్లో తమన్నా అద్భుతమైన నటనతో అందర్నీ మెప్పించింది. తన 20ఏళ్ల కెరీర్ ఓవైపు.. ఇందులో తన శివశక్తి పాత్ర ఇంకోవైపు అని అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ చిత్ర క్లైమాక్స్‌లో నంది, శివుడు కనిపించినప్పుడు ప్రేక్షకులు ఎలా ఫీలయ్యారన్నది నాకు ఫోన్ చేసి చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. దీంట్లో సమాధి శిక్ష, సైకిల్ ఎపిసోడ్, ఆఖరి 20నిమిషాల యాక్షన్ సీక్వెన్స్ గురించి అందరూ ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఈ మంచిని అందరికీ చెప్పే ప్రయత్నం చేయండి. విడుదలకు ముందే మా సినిమా బ్రేక్ ఈవెన్ అయింది. మాకు ప్రేక్షకుల రూపంలో వచ్చే ప్రతి రూపాయినీ ఆ పరమాత్ముడు ఇచ్చే ప్రసాదంగానే భావిస్తాం” అన్నారు. “ఇది చాలా గొప్ప సినిమా. క్లైమాక్స్‌లో శివుడి దర్శనం జరిగేటప్పుడు ప్రేక్షకులు దేవుడికి దండం పెడుతున్నారు” అన్నారు నటుడు వశిష్ఠ. నిర్మాత మధు మాట్లాడుతూ.. “మేము అనుకున్నట్లుగానే మంచి భక్తిభావం ఉన్న సినిమా తీశాం. దీని ద్వారా నా జీవితంలో ఎన్నో అద్భుతాలు జరిగాయి” అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ తేజ, రాజీవ్ నాయర్, వెంకట్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.



# గారాలపట్టి కోసం ‘వెండి పట్టీలు’

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతు వీరబాబు. ఆయన భార్య సీత. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న వీరిద్దరి గారాలపట్టి బుజ్జమ్మ. ఓ రోజు తనకు వెండి పట్టీలు కావాలని వీరబాబును అడుగుతుంది ఆ చిన్నారి. దీంతో పంట చేతికొచ్చిన తర్వాత పట్టీలు కొనిస్తానని కుమార్తెకు మాటిస్తాడు ఆ తండ్రి. మరి ఇంతకీ వీరబాబుకు ఆ పంట చేతికందిందా? ఆయన తన కూతురికిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడా? అనేది తెలియాలంటే ‘వెండిపట్టీలు’ చూడాల్సిందే. సతీశ్ వేగేశ్న దర్శకత్వం వహించిన చిత్రమిది. బాలాదిత్య, లతా రెడ్డి, బేబీ జైత్రా వరేణ్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. శతమానం భవతి ఆర్ట్స్ నిర్మించింది. తాజాగా ఈ చిత్రం ఆదివారం నుంచి ప్రముఖ ఓటీటీ ఈటీవీ విన్ వేదికగా ప్రసారమవుతోంది. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తీర్చిదిద్దిన ఈ కథలో పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు.. అకాల వర్షా ల కారణంగా చేతికొచ్చిన పంట నేలపాలైతే ఎంత బాధ అనుభవిస్తారో కళ్లకు కట్టినట్లు చూపించారు. మరి “కష్టే ఫలి అంటారు కదా.. కానీ ఎందుకో రైతుకు మాత్రం ఆ మాట వర్తించదు” అంటూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోన్న ఈ ‘వెండిపట్టీలు’ కథేంటో మీరు చూసేయ్యండి.



# శరవేగంగా ‘హృదయపూర్వం’

అగ్రతారల సరసన అవకాశాల్ని అందుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది కథానాయిక మాళవిక మోహనన్. ఆమె.. మలయాళ అగ్రకథానాయకుడు మోహన్‌లాల్‌తో కలిసి ‘హృదయపూర్వం’ అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పుణెలో జరుగుతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటను పంచుకుంది మాళవిక. “రెండు వారాల నుంచి పుణెలో షూటింగ్ చేస్తున్నాం. ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొవాల్సి వస్తుంది కానీ… చాలా సరదాగా ఉంది. మా ‘హృదయపూర్వం’ చిత్రబృందం మీ కోసం మునుపెన్నడూ చూడని కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయడానికి కష్టపడుతోంది. త్వరలో థియేటర్లలో కలుద్దాం” అని వ్యాఖ్యల్ని జోడించింది. ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. త్వరలో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.